క్లుప్తంగా

బాధితులకు 'భరోసా'



గట్టు: లైంగిక దాడులు, వేధింపులకు గురైన బాధితులకు భరోసా కేంద్రం అండగా ఉంటున్నట్లు ఎస్‌ఐ మల్లేష్, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ శివాని తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో భరోసా కేంద్రం వారు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భరోసా కేంద్రం ద్వారా వైద్యం, న్యాయ సాయం కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. లైంగిక వేధింపులకు గురై వారు 6303923257, 100కు కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఓ గోపిలత, భరోసా కేంద్రం సిబ్బంది కీర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల రూరల్: మండలంలోని పూడూరు సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ శ్రీనివాసులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు మండలంలోని వీరాపురం, బీరెల్లి, పూడూరు సబ్‌స్టేషన్ల పరిధిలో సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 11కేవీ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో కొత్త హౌసింగ్ బోర్డు, జమ్మిచేడు మెయిన్ రోడ్డు, హమాలీ కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్ బాబు తెలిపారు.

శంకుస్థాపనకు హాజరుకండి

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని కోయిల్‌దిన్నె రోడ్డు సమీపంలో నిర్మించనున్న అయ్యప్పస్వాముల వారి ఆలయ నిర్మాణ శంకుస్థాపనకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని నిర్మాణ కమిటీ సభ్యులు కోరారు. శనివారం తెల్లవారుజామున 4:04గంటలకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

అలంపూర్ రూరల్: పట్టణంలోని బాలికల జెడ్పీహెచ్‌ఎస్ శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పిల్లలకు ఎత్తు, బరువు, జ్వరం, బీపీ తదితర పరీక్షలు చేశారు. వైద్యులు సవిత, రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రై డే పాటించాలి

మానవపాడు: వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి శుక్రవారం అందరూ డ్రై డే పాటించాలని ఎంపీఓ భాస్కర్ సూచించారు. శుక్రవారం మండలంలోని డ్రై డే ఫ్రై డే కార్యక్రమం పెద్దఆముదాలపాడు, నారాయణపురంలో నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల వితరణ

గట్టు: మండలంలోని యల్లందొడ్డి ప్రాథమిక పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయుడు రాముడు విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా బ్యాగులను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీసీసీబీ అధ్యక్షుడికి అభినందన



గద్వాల: ఉమ్మడి పాలమూరు జిల్లా డీసీసీబీ అధ్యక్షుడిగా ఎన్నికైన విష్ణువర్ధన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, బండ్ల రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు పూలబొకే, శాలువాతో సన్మానం చేశారు.

విద్యుత్ తీగలకు తాకుతున్న కొమ్మలు



అయిజ: మున్సిపాలిటీలో ప్రధాన రహదారుల్లో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయి. తెలంగాణ చౌరస్తా నుంచి ఎస్‌బీఐ భవనం వరకు స్తంభాలకు, తీగలకు చెట్ల కొమ్మలు తాకుతున్నాయి. చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ వారు తొలగించకపోవడంతో తరుచూ తీగలు తగిలి నిప్పు రవ్వలు ఏర్పడి ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అవుతున్నాయి. కొన్నిసార్లు ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఏర్పాటు చేసిన ఫ్యూజులు కాలిపోతున్నాయి. వర్షాకాలంలో ఇవి ప్రమాదంగా మారాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చెట్లకొమ్మలను తొలగించి, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగమేనా..?

- గోదాంల నిర్మాణానికి రూ.కోట్ల ఖర్చు
- రైతులకు ఉపయోగపడని వైనం
- ఏసీ గోదాంలుగా మార్చాలని డిమాండ్



నిరుపయోగంగా ఉన్న జిల్లెడుదిన్నె గోదాం

శాంతినగర్: రైతులు పండించిన ధాన్యం నిల్వ చేసుకునేందుకు రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన గోదాంలు నిరుపయోగంగా మారాయి. దీంతో సుదూర ప్రాంతాలకు ధాన్యాన్ని తరలించి ప్రైవేట్ గోదాముల్లో నిల్వ చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అలంపూర్ నియోజకవర్గంలో 2016–2017లో నాబార్డ్ నిధులతో గోదాంలు నిర్మించారు. నియోజకవర్గంలో గోదాంలు ఉన్నా రైతులకు మాత్రం ఉపయోగపడటం లేదు. ఈ విషయమై జిల్లా మార్కెటింగ్ అధికారులు స్పందించి రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాంలకు ఏసీ ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించి లక్ష్యం నెరవేరేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రూ.కోట్లు వెచ్చించి నిర్మాణాలు

అలంపూర్ నియోజకవర్గంలో వడ్డేపల్లి మండలంలో జిల్లెడుదిన్నె సమీపంలో, ఉండవెల్లి, అయిజ, అలంపూర్ చౌరస్తా, మానవపాడు, ఇటిక్యాలలో–2 మొత్తం ఆరు గోదాంలు 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో, ఒక్కోదానికి రూ.3 కోట్లు మొత్తం రూ.18 కోట్లు వెచ్చించి నిర్మించారు. అలంపూర్ చౌరస్తాలో వెయ్యి మెట్రిక్ టన్నులు, 400 మెట్రిక్ టన్నులు, అయిజలో మరో 400 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాంలు నిర్మించారు. ఇవి రైతులకు ఉపయోగపడకపోవడమే గాక ప్రభుత్వ ఇతర అవసరాలకు వాటిని వాడుకోకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

రూ.కోట్లు వెచ్చిస్తే రూ.వేల అద్దెలు

ఒక్కో గోదాంను రూ.3 కోట్లు వెచ్చించి నిర్మిస్తే రూ.92వేల నుంచి రూ.98 వేలకు వాటిని అద్దెకు ఇస్తున్నారు. దీంతో రూ.3 కోట్ల వ్యయానికి ఏడాదికి ఎంత వడ్డీ అవుతుందో కిరాయి ఎంత వస్తుందో అధికారులకే తెలియాలని, అంతే మొత్తం రైతుల నుంచి తీసుకుని రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేస్తే కనీసం లక్ష్యమైనా నెరవేరుతుందని నియోజకవర్గ ప్రజలు, రైతులు అభిప్రాయపడుతున్నారు. అయిజలో నిర్మించిన 400 మెట్రిక్ టన్నుల గోదాంకు కేవలం రూ.1,400 అద్దెకు ఇచ్చారంటే పరిస్థితి ఏంటో అధికారులు, ప్రభుత్వానికే తెలియాలని పెదవి విరుస్తున్నారు.

నష్టపోతున్నాం..



రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా గోదాంలు ఉపయోగపడాలి. మా గ్రామ సమీపంలో పెద్ద గోదాం నిర్మించారు. పండించిన ధాన్యాన్ని మాత్రం మానవపాడు, అలంపూర్ చౌరస్తాల్లోని ప్రైవేట్ ఏసీ గోదాముల్లో అద్దె చెల్లించి నిల్వ చేసుకుంటున్నాం. ధాన్యానికి ధర లేనప్పుడు ప్రైవేట్ గోదాముల్లో ఎక్కువ అద్దె చెల్లించలేక ఏదో ఒక ధరకు ధాన్యాన్ని విక్రయించుకుని నష్టపోతున్నాం. – చిన్న బీచుపల్లి, రైతు, రామాపురం

ఏసీగా మార్చాలి..



గోదాంలు నిర్మించారు గాని ఏసీ ఏర్పాటు చేయలేదు. ఏసీ లేనందున ధాన్యం ఎక్కువ రోజులు నిల్వ ఉండదు. అందుకే రైతులు ప్రైవేట్ ఏసీ గోదాముల్లో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అన్ని కోట్లు పెట్టిన వారు కేవలం ఏసీ ఏర్పాటు చేయకపోవడమేమిటో అర్థం కావడం లేదు.
– వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు, ఉండవెల్లి

కొన్ని ఖాళీగా ఉన్నాయి..

నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన కొన్ని గోదాముల్లో జిల్లెడుదిన్నె, ఉండవెల్లి ఖాళీగా ఉన్నాయి. మిగతా గోదాములను సివిల్ సప్లయి వారికి అద్దెకు ఇచ్చాం. ఏసీ లేనందున అప్పుడప్పుడు గన్నీ బ్యాగులు, ఈవీఎంలు నిల్వ చేసేందుకు ఇస్తుంటాం.
– ఎల్లస్వామి, కార్యదర్శి, మార్కెటింగ్‌శాఖ, అలంపూర్ చౌరస్తా

ఉద్యోగులకు సీపీఎస్‌తో తీవ్రనష్టం



అలంపూర్‌చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు



గట్టులో..

అలంపూర్: సీపీఎస్ విధానం ప్రభుత్వ ఉద్యోగులకు తీవ్ర నష్టమని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అలంపూర్‌చౌరస్తాలోని ఫ్లైఓవర్ కూడలిలో సీపీఎస్ విధానం చేసిన దినాన్ని బ్లాక్ డేగా సూచిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం కొనసాగిస్తూ ఇచ్చిన జీఓను రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సీపీఎస్ విధానం కొనసాగిస్తూ గత ప్రభుత్వం ఆగస్టు 23వ తేదీన జీఓ తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. అందుకే ఆగస్టు 23ను బ్లాక్ డేగా నిలిచిందన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో విష్ణు, శ్రీనివాసులు, అమీర్ పాష, అమరేందర్ రెడ్డి, వెంకటకృష్ణ, ప్రతాప్ రెడ్డి, కుమార్ నాయుడు, గజరాజు, సురేష్, వెంకటాచలం, మక్బుల్, వెంకటేష్, గోపాల్ రెడ్డి, ఈశ్వర్, మస్తాన్, శ్రీను, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

గట్టు: సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని స్థానిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నర్సింహులుగౌడు, రమేష్‌కుమార్, పరశురాం, నర్సింహులు, కృష్ణమూర్తి, సరిత తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాలి

అయిజ: ప్రభుత్వం పాత పెన్షన్‌ను పునరుద్ధరణ చేయాలని టీఎస్ సీపీఎస్ ఈయూ జిల్లా మహిళా కార్యదర్శి దానమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల వద్ద ఉపాధ్యాయులు భోజన విరామం సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి, జీఓ పత్రాలను కాల్చివేసి, నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీరేష్, రాందాస్, రాములు, కృష్ణవర్ధన్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీపీఎం నుంచి ఓపీఎస్‌కు మార్చాలని పంచాయతీ కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు.

మల్దకల్: పాఠశాలలు, కళాశాలల్లో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో భరత్, పరమేష్, వెంకటయ్య, రమేష్, అఫ్రోజ్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల బ్లాక్‌డే సందర్భంగా నిరసన తెలిపారు. అనంతరం జీవో 28 ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో కర్రెప్ప, పాండు తదితరులు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో బాధిత కుటుంబానికి అందజేశారు. ఉండవెల్లి మండలం కేంద్రానికి చెందిన జయలక్ష్మికి వైద్యం కోసం రూ.3.50 లక్షలు ఎల్‌ఓసీ మంజూరైనట్లు తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గజేందర్‌రెడ్డి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, రఘురెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో కుంకుమార్చన పూజలు



ఎర్రవల్లిలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం అర్చకులు అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. ఎర్రవల్లి చౌరస్తాలోని శివాంజనేయస్వామి ఆలయంలో కుంకుమార్చనకు మహిళలు అధిక సంఖ్యలో హాజరై చేపట్టారు.

సమస్యల వలయంలో అనుబంధ గ్రామాలు



చిప్పదొడ్డిలో రోడ్డుపై నిలిచిన మురుగు

- సీసీరోడ్లు, డ్రెయినేజీలు లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

మల్దకల్: మండలంలో పంచాయతీలకు అనుబంధంగా ఉన్న గ్రామాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. సీసీరోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. రేషన్ షాపులు లేకపోవడంతో రేషన్ బియ్యం కోసం సుదూర గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది. మండలంలోని 25 పంచాయతీలకు 5 అనుబంధ గ్రామాలున్నాయి. వాటిలో బూడిదపాడు, ఎద్దులగూడెం, నేతువానిపల్లి తండా, ఈదులపల్లి, చిప్పదొడ్డి గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో సమస్యలు తాండవిస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. రేషన్ దుకాణాలు లేకపోవడంతో ప్రతినెల బియ్యం కోసం మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శివారు గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

గద్వాల నియోజకవర్గంలో..

మండలం	గ్రామ పంచాయతీలు	అనుబంధ గ్రామాలు
మల్దకల్	25	5
గద్వాల	28	4
గట్టు	27	5
కేటీదొడ్డి	23	5
ధరూరు	28	8

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

గ్రామ పంచాయతీల అనుబంధ గ్రామాల్లో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ఏయే గ్రామాల్లో సమస్యలున్నాయే, నివేదిక ఉన్నతాధికారులకు పంపిస్తాం. నిధులు మంజూరైన వెంటనే సమస్యలు పరిష్కరిస్తాం.
– ఆంజనేయరెడ్డి, ఎంపీడీఓ, మల్దకల్

అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి



గ్రామంలో అంగన్‌వాడీ లేకపోవడంతో చర్లగార్లపాడుకు వెళ్లి అక్కడ పౌష్టికాహారం తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గర్భిణులు, బాలింతలు అక్కడికి వెళ్లి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోనే అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి – పరిమిత, ఎద్దులగూడెం

డ్రెయినేజీ ఏర్పాటు చేయాలి



సీసీరోడ్లు ఉన్నా డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే మురుగు రోడ్లపైనే పారుతూ దుర్వాసన వస్తోంది. అనుబంధ గ్రామాలపై అధికారులు సవతి ప్రేమను చూపిస్తున్నారు. గ్రామాలను సందర్శించి సమస్యలు పరిష్కరించాలి. – రామన్న, చిప్పదొడ్డి

అద్దెభవనంలో అంగన్‌వాడీ కేంద్రం



గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం ఏర్పాటు చేయాలి. అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. వసతులు లేక పౌష్టికాహారం తీసుకునేందుకు వచ్చే గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు.
– నర్సింహులు, నేతువానిపల్లి తండా

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



నందిన్నెలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు

కేటీదొడ్డి: అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. మండలంలోని నందిన్నెలో శుక్రవారం రాత్రి రోడ్డు భద్రత, ట్రాఫిక్, సైబర్ నేరాలపై ప్రజలకు కళాజాతా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తులు గ్రామంలోకి కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సాహించిన వారిపై కేసులు నమోదు చేస్తామని, మహిళలు, బాలికలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన



అయిజలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

అయిజ: మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులు శుక్రవారం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నంబర్లు, ప్లాట్ అప్లికేషన్ల సంఖ్య, రోడ్డు విస్తీర్ణం, ఇనాం భూమి, ఓఆర్సీ అనుమతి తదితర అంశాలను పూర్తి స్థాయిలో పరిగణలోకి తీసుకుని నివేదిక తయారు చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ విజయమ్మ, రెవెన్యూ అధికారులు మద్దిలేటి, లక్ష్మిరెడ్డి, కరీం, నావిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యుడిని నియమించండి



మూసి ఉన్న పశువైద్య కేంద్రం

మల్దకల్: మండలంలోని పాల్వాయిలో పశువైద్య కేంద్రానికి వైద్యుడిని నియమించాలని రైతులు కోరుతున్నారు. రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన కొత్త పశువైద్య కేంద్రానికి డాక్టర్‌ను నియమించకపోవడంతో భవనం నిరుపయోగంగా మారిందని పేర్కొన్నారు. పశువులు, గొర్రెలకు వచ్చే వ్యాధులతో మృత్యువాత పడే అవకాశాలున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్యుడిని నియమించాలని కోరారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



ఖోఖో పోటీలో పాల్గొన్న విద్యార్థులు

మల్దకల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో అండర్–14, 17 బాలబాలికలకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలలో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. గెలుపొందిన విద్యార్థులకు వచ్చే నెలలో జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభను చాటి మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ ఆనంద్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జితేందర్, పీడీలు సుహాసిని, రత్నమాల, రజినీకాంత్, ఆనంద్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



జనరేటర్‌కు మరమ్మతు చేయండి

శాంతినగర్: వడ్డేపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జనరేటర్ కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉంది. కార్యాలయ వేళల్లో కరెంట్ సరఫరా నిలిచిపోతే రిజిస్ట్రేషన్లు చేయించుకునేవారికి, కార్యాలయంలో వివిధ పనులకు కంప్యూటర్లకు ఆటంకం ఏర్పడుతుంది. ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందించి జనరేటర్‌కు మరమ్మతు చేయించి సమస్య పరిష్కరించాలి.

ప్రశ్నించాల్సిన అధికారి : జ్యోషి శ్రీనివాస శర్మ, తహసీల్దార్,
సెల్ నంబర్ : 7382111165

రోడ్డుపై కూరుకుపోయిన వాహనం



మార్లబీడు రోడ్డుపై బురదలో ఇరుక్కుపోయిన వాహనం

ధరూరు: మండలంలోని మార్లబీడులో వాహనం బురదలో కూరుకుపోయింది. బుధవారం ఓ టిప్పర్ ఇరుక్కుని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడగా, శుక్రవారం మరో కాంక్రీట్ మిక్సింగ్ ట్యాంకర్(లారీ) నడిరోడ్డుపై ఇరుక్కుపోయింది. గద్వాల – గట్టుకు వెళ్లే ఈ మార్గంలో మార్లబీడులో రోడ్డు అధ్వానంగా ఉన్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మోకాలు లోతు గుంతలు ఉండడంతో వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. వాహనదారులకు వేరే మార్గం లేక నానా అవస్థలు పడుతూ ప్రయాణాలు సాగించాల్సి వస్తుంది. ముఖ్యంగా ఉదయం అటుగా వెళ్లే ఆర్టీసీ బస్సులు తీవ్ర ఇబ్బంది పడుతూ వెళ్లాయి. వర్షాకాలంలో మట్టి రోడ్లతో ఇబ్బందులు వస్తాయని తెలిసినా అటు అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించండి

అలంపూర్ రూరల్: మండలంలోని లింగన్‌వాయి హరిజనవాడ ప్రభుత్వ పాఠశాలను సీపీఎం నాయకుడు ఈదన్న శుక్రవారం సందర్శించారు. పాఠశాలకు ప్రహరీ లేక పిల్లల బయట తిరుగుతున్నారని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రహరి నిర్మించాలని కోరారు.